క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణ పనుల నేపథ్యంలో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి సబ్‌స్టేషన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ నిజాంపేట్, ఎస్ఎంఎస్, ఎస్ఏలీజీ, మావిల్లాస్ ఫీడర్ల పరిధిలోని బాచుపల్లి పోలీస్‌స్టేషన్ ప్రాంతం, శ్రీకర విల్లాస్ నుంచి బాచుపల్లి సిగ్నల్స్ వరకు, బాచుపల్లి ప్రధాన రోడ్డులో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేడు వినాయక నిమజ్జన ఏర్పాట్లపై సమావేశం

కుత్బుల్లాపూర్: వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా గణపతుల నిమజ్జనాల ఏర్పాట్లపై బుధవారం సర్కిల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించనున్నట్లు కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నాగమణి తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి ఎమ్మెల్యే వివేకానంద్‌తో పాటు ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసు అధికారులు, ఇంజనీరింగ్, పారిశుద్ధ్యం, వైద్యారోగ్య తదితర శాఖల అధికారులు పాల్గొంటారని ఉపకమిషనర్ పేర్కొన్నారు.

మర్రి లక్ష్మణ్‌రెడ్డికి సత్కారం


మర్రి లక్ష్మణ్‌రెడ్డిని సత్కరిస్తున్న ఆస్ట్రేలియా మంత్రి ఎర్డోగాన్, తెలుగు కమ్యూనిటీ సభ్యులు

దుండిగల్: విద్యారంగం, క్రీడల అభివృద్ధికి ఎంఎల్ఆర్ విద్యా సంస్థల చైర్మన్, వెటరన్ క్రీడాకారుడు మర్రి లక్ష్మణ్‌రెడ్డి చేస్తున్న కృషిని ఆస్ట్రేలియన్ తెలుగు కమ్యూనిటీ గుర్తించింది. ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ఆయనను మంగళవారం ఆ దేశ మంత్రి ఏర్డోగాన్, సభ్యులు మెమొంటో అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, రామ్ కట్టెల, తెలుగు కమ్యూనిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ షురూ



చింతల్: క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీయడానికి టోర్నమెంట్‌లు దోహదపడతాయని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. చింతల్ హెచ్ఎంటీ గ్రౌండ్‌లో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర నాయకుడు గొల్ల జాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 17వ రాజీవ్ గాంధీ మెమోరియల్ స్పోర్ట్స్ మీట్‌ను మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. టాస్ వేసి కబడ్డీ, బ్యాటింగ్ చేసి క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు.

17న టెడెక్స్ హైదరాబాద్

సాక్షి, సిటీబ్యూరో: విజయవంతమైన వ్యక్తుల ప్రసంగాల వేదిక టెడెక్స్ హైదరాబాద్ నగరంలో తమ 9వ ఎడిషన్‌ను ఈ నెల17 నిర్వహించనుంది. ఈ సందర్భంగా నగరంలో గచ్చిబౌలిలో ఉన్న ప్రధాన్ కన్వెన్షన్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో ప్రసంగించనున్న 12 మంది భిన్నరంగాలకు చెందిన విజయవంతమైన వ్యక్తుల జాబితాను శనివారం విడుదల చేసింది. వీరిలో నగరానికి చెందిన సస్టెయినబుల్ ఛాంపియన్ కల్పనా రమేష్, పిన్న వయసు పర్వతారోహకురాలు మలావత్ పూర్ణ, నెఫ్రోప్లస్ వ్యవస్థాపకుడు కమల్‌షా ఉన్నారు.

పున్నారావుకు 'మ్యాన్ ఆఫ్ ద మంత్' అవార్డు

శేరిలింగంపల్లి: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ మ్యాన్ ఆఫ్ ద మంత్ అవార్డును లింగంపల్లి రైల్వే స్టేషన్ డిప్యూటీ స్టేషన్ మాస్టర్ టి.పున్నారావు దక్కించుకున్నారు. ఈ మేరకు మంగళవారం జరిగిన కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఆఫీస్‌లో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అందజేస్తారు. ఈ సందర్భంగా పున్నారావును లింగంపల్లి స్టేషన్‌లో ఉద్యోగులు, అధికారులు అభినందించారు.

16న 'ఎంపవరింగ్ ది ఫ్యామిలీ' ముగింపు

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థలోని విమెన్స్ వింగ్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన 'ఎంపవరింగ్ ది ఫ్యామిలీ' కార్యక్రమం ముగింపు కార్యక్రమాన్ని ఈనెల 16వ తేదీన ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు గచ్చిబౌలి శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక ఉపన్యాస, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040-23001234లో సంప్రదించవచ్చు.


అభివృద్ధికి నోచుకోని పార్కు ప్రాంగణం


పార్కులో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణం


పేరుకుపోయిన చెత్తాచెదారం

పేరులో ఆదర్శం నిర్వహణలో నిర్లక్ష్యం

రంగారెడ్డినగర్: ఆ కాలనీ పేరులోనే ఆదర్శం ఉంది. కానీ ఆదర్శనగర్ సొసైటీ పార్కు నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఆదర్శనగర్ సొసైటీలో సుమారు 500 పైచీలుకు ఇళ్లు ఉన్నాయి. అందులో 2వేల వరకు జనాభా నివసిస్తున్నారు. సంక్షేమ సంఘం ప్రతి నెలా ఇళ్ల నివాసితుల నుంచి కాలనీ అభివృద్ధి కోసం సొసైటీ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నారు. అయితే కాలనీలో ప్రజల ఉపయోగార్థం ఏర్పాటు చేసిన పార్కును మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో పార్కు ప్రాంతంలో చెత్తాచెదారులు పేరుకుపోయాయి. కూర్చోవడానికి వేసిన బెంచీల్లో ధూళి పేరుకుపోతోంది.

– అదే విధంగా పార్కులో పిల్లల ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన జారుడుబండ, ఊయల వంటి సామగ్రి తప్పు పట్టాయి. శిథిలావస్థకు చేరుకున్న కొంత సామగ్రిని పార్కులోని ఓ మూలన స్క్రాప్‌గా పడేశారు. ఇటు సొసైటీ, అటు సర్కిల్ అధికారులు పట్టించుకోకపోవడంతో పార్కు ప్రాంతం పూర్తిగా చెత్తాచెదారాలతో నిండిపోయింది.



ఆదర్శనగర్‌లోని పార్కు స్థలం

ఇటు సొసైటీ.. అటు సర్కిల్ అధికారులు పార్కు అభివృద్ధిని గాలికొదిలేయడంతో తాము పక్కనే ఉనన ఏపీహెచ్‌బీ కాలనీలోని పార్కుకు వెళ్లాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా పార్కు అభివృద్ధికి సొసైటీ సభ్యులు దృష్టి సారించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.


శిథిలావస్థలో ఊయల, జారుడు బల్ల

చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన


సూరారం కట్టమైసమ్మ చెరువు వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పోలీసులు

కుత్బుల్లాపూర్: వినాయక చవితి నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆయా చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లను మంగళవారం ట్రాఫిక్ అధికారులు పర్యవేక్షించారు. సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ నారాయణ్‌నాయక్, మేడ్చల్ డీసీపీ శ్రీనివాస్‌రావు, అడిషనల్ డీసీపీ వేణుగోపాల్‌రెడ్డిల నేతృత్వంలో సూరారం కట్టమైసమ్మ చెరువు, వెన్నెలగడ్డ ఎన్నాచెరువు, గాజులరామారంలోని చింతల్ చెరువులను సందర్శించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిమజ్జనాలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలి

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు మంగళవారం కేకేఎం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు, గడియారం, గొడుగులతో కూడిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్దన్‌రెడ్డి, శివాజీ రాజా, శంకర్ నాయక్, అశోక్, రమేష్, నర్సింహ, నర్సింగ్‌రావ్, శేఖర్, కుమార్‌గౌడ్, శ్రీకాంత్, దుర్గ, జ్యోతి, ట్రస్ట్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను కిట్లను అందజేస్తున్న కూన శ్రీనివాస్‌గౌడ్

'గురువు అనుగ్రహం ఉంటే అజ్ఞాని కూడా జ్ఞాని అవుతాడు'


ప్రభుత్వ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నార్త్ సిటీ హైస్కూల్ యాజమాన్యం

సుభాష్‌నగర్: అజ్ఞానమనే చీకటిలో ఉన్నవారికి, విజ్ఞానమని దారి చూపి వారి జీవితాల్లో వెలుగును నింపే వారే ఉపాధ్యాయుడని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కోల వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని సూరారం, సూరారంకాలనీ దూలపల్లి, శివాలయం నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చెందిన ఉపాధ్యాయులను నార్త్ సిటీ హైస్కూల్ యాజమాన్యం మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. గురువు అనుగ్రహం కలిగిన నాడు అజ్ఞాని కూడా జ్ఞానవంతుడు అవుతాడని అన్నారు. నేటి యువత గురువు యొక్క ప్రాముఖ్యత తెలుసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవీందర్ ముదిరాజ్, ప్రైవేట్ పాఠశాలల జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

'లీకేజీ పాయింట్‌ను పట్టేశారు'


పైపులైన్ లీకేజీ పాయింట్‌ను క్యూఐడబ్ల్యూపీఎస్ పరికరంలో పరిశీలిస్తున్న అధికారులు

చింతల్: కొన్ని రోజులుగా అధికారులను ముప్పుతిప్పలు పెడుతున్న లీకేజీ పాయింట్‌ను మంగళవారం ఎట్టకేలకు పట్టేశారు. కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీడిమెట్ల సెక్షన్ పరిధిలోని భగత్ సింగ్‌నగర్‌లో ఓ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటంతో నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్య పరిష్కారం కోసం అధికారులు ఒక కాంట్రాక్టర్లకు పనులు అప్పజెప్పారు. ఎక్కడ తవ్వకాలు చేపట్టినా సమస్యను కనుగొనలేకపోయారు. కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ జీఎం శ్రీధర్‌రెడ్డి ఆదేశాలతో ఏర్పాటు చేసిన అత్యాధునిక టెక్నాలజీ సహాయంతో మంగళవారం క్యూ ఐడబ్ల్యూపీఎస్ ఆధునిక పరికరంతో పైప్ లైన్ లీకేజీ ప్రాంతాన్ని గుర్తించి ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. సబ్ డివిజన్ డీజీఎం రాజేష్, జీడిమెట్ల సెక్షన్ మేనేజర్ రాజు, సుచిత్ర సెక్షన్ మేనేజర్ శివకుమార్ తదితరులు పరికర పరిశీలనలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ

కుత్బుల్లాపూర్: ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలేని నియోవకర్గంలో కుత్బుల్లాపూర్‌ను తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. దుండిగల్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో.ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మన్నెరాజు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దమ్మ తల్లి ఆలయానికి వెళ్లే మార్గంలో రోడ్డు సదుపాయం కల్పించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఆలయ ముదిరాజ్ కమిటీ చైర్మన్ లక్ష్మణ్ ముదిరాజ్, జనరల్ సెక్రటరీ నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ కృష్ణ, లక్ష్మణ్‌ముదిరాజ్, సత్యనారాయణ, నర్సింగ్ రావు, మల్లేష్, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఓటరు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దుండిగల్ ఎస్‌బీఐ బ్యాంక్, వార్డు కార్యాలయం, ప్రైవేటు కళాశాలల్లో పలువురికి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ కళ్యాణి, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ మంజుల, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

సైబర్ వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్: ఏసీ రిపేరు కోసం గూగుల్లో శోధించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సైబర్ వలలో పడి రూ.2 లక్షల 96 వేలు పోగొట్టుకున్నాడు. పటాన్‌చెరు పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ఇంద్రేశంకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సెప్టెంబర్ తొమ్మిదవ తేదీన ఏసీ రిపేరు చేయించేందుకు గూగుల్లో వెదికాడు.ఈ క్రమంలో ఓ ఫోన్ నెంబర్ దొరకగానే కాల్ చేశాడు.దీంతో అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా తాను యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని అపరిచిత వ్యక్తి చెప్పిన విధంగా ఓటీపీలు చెబుతూ వచ్చాడు దీంతో అతని ఖాతాలో ఉన్న రూ.2 లక్షల 96 వేలు మాయమయ్యాయి. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు అనంతరం మంగళవారం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

దుండిగల్: ఎల్లమ్మ, పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లి చంద్రశేఖర్‌రెడ్డి కాలనీలోని ఆలయంలో ఉత్సవాలు నిర్వహించారు. కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, బండారి మహేందర్ యాదవ్, సాయి యాదవ్‌లు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్లేశ్ ముదిరాజ్, కృష్ణ, లింగంగౌడ్, ఆనంద్, సాయి, రాజ్‌కుమార్, ప్రశాంత్, పవన్, శ్రీనివాస్, అశోక్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం


పేట్‌బషీరాబాద్‌లోని కట్టమైసమ్మ ఆలయంలో జరిగిన అన్నదానంలో పాల్గొన్న భక్తులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ పేట్‌బషీరాబాద్‌లోని కట్టమైసమ్మ ఆలయంలో మంగళవారం శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సంజయ్ వర్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ వివేక్‌రెడ్డి, శైలజ దంపతులు ఆలయం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పారిశుద్ధ్య కార్మికుల జీతాలను పెంచాలి


కార్పొరేషన్ మేనేజర్‌కు డిమాండ్లతో కూడిన పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నిజాంపేట్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారని.. వెయ్యి రూపాయలు పెంచుతామని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన సీఎం కేసీఆర్ హామీని నెరవేర్చలేదని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐటీయూసీ, సీఐటీయూల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా శ్రీనివాస్, వెంకటరాజ్యం మాట్లాడుతూ.. కార్మికులకు సమయానికి జీతాలు ఇవ్వడం లేదన్నారు. వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మూడు నెలలకోసారి కార్మికులకు వైద్య పరీక్షలు చేయించాలని.. జీతాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్పొరేషన్ మేనేజర్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు యాదయ్య, జీతయ్య, నర్సమ్మ, బాగ్యమ్మ, యాదమ్మ, పుష్పమ్మ, లక్ష్మి, కృష్ణ, రాములు, నాగయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీలో 'ఆరోగ్య మహిళ క్లినిక్' ప్రారంభం


కుత్బుల్లాపూర్ యూపీహెచ్‌సీలో క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డా. పుట్ల శ్రీనివాస్

కుత్బుల్లాపూర్: మహిళల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య మహిళ క్లినిక్ కార్యక్రమాన్ని చేపట్టిందని కుత్బుల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పారిజాత అన్నారు. మంగళవారం కుత్బుల్లాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళలకు ప్రత్యేక క్లినిక్‌ను ఆమె జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, ఉప వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఆరోగ్య మహిళ క్లినిక్ ద్వారా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళలకు అన్ని రకాల వైద్య పరీక్షలను ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వీలెన్స్ అధికారి డాక్టర్ కౌశిక్, కుత్బుల్లాపూర్, షాపూర్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జ్‌లు డాక్టర్ సృజన, డాక్టర్ నవనీత, సీహెచ్ఓ రాంచందర్, అంజన్న, శ్రీనివాస్, కమల్, ఆశావర్కర్లు ఉన్నారు.

తెలంగాణ సమైక్యతా దినోత్సవానికి ఎమ్మెల్సీ రాజు



కుత్బుల్లాపూర్: తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 17న ఆయా జిల్లా కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జాతీయ జెండాలను ఆవిష్కరించనున్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు జాతీయ సమైక్యతా దినోత్సవ వేడుకల్లో పాల్గొని త్రివర్ణ పతకాన్ని ఎగురవేయనున్నారు. సీఎం కేసీఆర్‌కు నమ్మిన బంటుగా, పురపాలక శాఖామంత్రి కేటీఆర్‌కు అత్యంత సన్నిహితుడుగా పేరొందని శంభీపూర్‌రాజుకు గతంలో సైతం నాలుగు పర్యాయాలు జాతీయ జెండాను ఎగురవేసే అవకాశం కల్పించారు.

డీసీపీ కార్యాలయంలో పోలీసులకు వైద్య పరీక్షలు


వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న డీసీపీ శ్రీనివాసరావు

జీడిమెట్ల: ప్రజా రక్షణలో ఉండే పోలీసులకు ఆరోగ్య రక్షణ కూడా చాలా ముఖ్యమని బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం షాపూర్‌నగర్‌లోని డీసీపీ కార్యాలయంలో పోలీసులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని డీసీపీ శ్రీనివాసరావు ప్రారంభించారు. వైద్య శిబిరంలో సౌజన్య డెంటల్, మాక్స్ విజన్ ఐఆస్పత్రి, ఆస్టార్ ప్రైమ్ ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు. వైద్య శిబిరంలో పోలీసులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరం ఉన్న పోలీసులకు మందులను అందజేశారు. కార్యక్రమంలో జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం


మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సుభాష్‌నగర్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్‌పల్లి ఇందిరమ్మ కాలనీలోని రేణుకఎల్లమ్మ ఆలయంలో మంగళవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీశైలంగౌడ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సత్కరించింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తజనం పాల్గొన్నారు.

ఇండియా ఈబీ–5 పెట్టుబడులపై ప్రత్యేక దృష్టి

- ఐఐయూఎస్ఏ అధ్యక్షుడు అరోన్‌గ్రా
- హైదరాబాద్ నాలెడ్జి సిటీలో 'ఇండియా ఈబీ–5 పాస్‌పోర్ట్ రోడ్డు షో సిరీస్'


విలేకరులతో మాట్లాడుతున్న ఐఐయూఎస్ఏ అధ్యక్షుడు అరోన్‌గ్రా తదితరులు

రాయదుర్గం: ఐఐయూఎస్ఏ పాస్‌పోర్టు సిరీస్ ద్వారా అమెరికాలో పెట్టుబడులకు ప్రత్యేకించి ఈబీ–5 ఇమ్మిగ్రేంట్ ఇన్వెస్టర్ ప్రోగామ్ భారతీయ పెట్టుబడిదారులకు అండగా ఉంటుందని ఐఐయూఎస్ఏ అధ్యక్షుడు అరోన్‌గ్రా పేర్కొన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో ఇన్వెస్ట్ ఇన్ యూఎస్ఏ(ఐఐయూఎస్ఏ), పీహెచ్‌డీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(పీహెచ్‌డీసీసీఐ) సంయుక్త ఆధ్వర్యంలో ఇండియా ఈబీ–5 పాస్‌పోర్ట్ రోడ్డు షో సిరీస్ కార్యక్రమాన్ని ఐఐయూఎస్ఏ డైరెక్టర్ ఆఫ్ ఈవెంట్స్, బిజినెస్ డెవలప్‌మెంట్ మెకెంజీ పెంటన్, పీహెచ్‌డీ సీసీఐ ఇంటర్నేషనల్ అఫైర్స్, ట్రేడ్ ఫెయిర్ డివిజన్ మయాంక్ చత్వాల్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇమ్మిగ్రేషన్ అవకాశాలపై పెరుగుతున్న ఆసక్తికి ఇది నిదర్శనమన్నారు. ఐఐయూఎస్ఏ పాస్‌పోర్ట్ సిరీస్ భారతీయ పెట్టుబడిదారుల మధ్య సంభాషణలు, కనెక్షన్లను సులభతరం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు.

క్రైం కార్నర్..

పురుగుల మందు తాగి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య


పురుగుల మందు


మృతురాలు మౌనిక

జగద్గిరిగుట్ట: పురుగుల మందు తాగి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్య చేసుకున్న ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నెహ్రూనగర్‌లో కొంత కాలంగా మౌనిక (23) తన స్నేహితురాలు సౌమ్యతో కలిసి ఉంటుంది. మౌనిక మాదాపూర్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తోంది. కాగా ఇటీవలే సౌమ్య తన సొంతూరికి వెళ్లగా మౌనిక గదిలోనే ఉంది. మౌనిక స్వస్థలం మంచిర్యాల. తమ తల్లిదండ్రులు ఫోన్ చేయగా మౌనిక నుంచి స్పందన రాకపోవడం చుట్టు పక్కల వాళ్లకు ఫోన్ చేసి ఆరా తీసారు. తెలిసిన వ్యక్తి మంగళవారం ఉదయం వెళ్లి చూడగా గది తలుపులు తెరచి ఉన్నాయని, మౌనిక స్పృహలో లేదని తెలిపాడు. పక్కనే పురుగుల మందు బాటిల్ కూడా ఉందని తెలిపాడు. వెంటనే 108కి ఫోన్ చేయగా సిబ్బంది వచ్చి చూసి చనిపోయిందని తెలిపారు.

ప్రేమే కారణమా..?

2 నెలల క్రితం ఓ అబ్బాయిని ప్రేమిస్తున్నానని మౌనిక తెలిపిందని దీనికి అంగీకరించకపోవడంతో తమతో మాట్లాడడం లేదని తల్లిదండ్రులు తెలిపారు. కాగా ఆ అబ్బాయి వేరే అమ్మాయిని పెళ్లి చేసుకుంటున్నాడని మౌనిక తమతో తెలిపిందన్నారు. ఈ విషయంపైనే తమ కూతురు మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని మౌనిక తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.